

ఆస్థాన మండపంలో యాగం నిర్వహిస్తున్న అర్చక, పండితులు





విద్యార్థులకు ప్యాడు, పెన్ను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ - పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా మహా సరస్వతి యాగం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించి పూతలపట్టు నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆకాంక్షించారు. కాణిపాక క్షేత్రంలోని ఆస్థాన మండపంలో సోమవారం మహాసరస్వతి యాగాన్ని వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులు 2,500 మంది హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరసిద్ధుడి కృపతో అందరూ చక్కగా పరీక్షలు రాయాలని కోరుకుంటూ విద్యార్థులకు ప్యాడు, పెన్ను, స్వామి కంకణాలు అందించారు. ఎస్‌ఎస్‌ ఏపీవో వెంకటరమణ, డీవైఈవో చంద్రశేఖర్, ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీసీ రోడ్ల నిర్మాణం

- పంచాయతీరాజ్ శాఖలో రూ.97 కోట్లతో పనులు
- ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి



ఫటా ఫట్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక సీసీ, బీటీ, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో జిల్లాలో ఆ శాఖలో జరుగుతున్న పనుల పురోగతి గురించి మాట్లాడారు.

● రూ.93.87 కోట్లతో 1,664 పనులు

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రూ.73.75 కోట్లతో 1,511 సీసీ రోడ్లు మంజూరు అవ్వగా, వాటిలో రూ.45 కోట్లతో 1,062 పనుల్ని పూర్తి చేశాం. మిగిలిన వాటి నిర్మాణం కూడా వేగంగా జరుగుతోంది. మొత్తంగా ఎంపీ లాడ్స్ కాకుండా పంచాయతీరాజ్ శాఖలోనే రూ.93.87 కోట్లతో 1,664 పనులు పురోగతిలో ఉన్నాయి.

● అప్రోచ్, బీటీ రోడ్లు, ప్రహరీలు కూడా..

రూ.6.13 కోట్లతో 39 అప్రోచ్ రోడ్లను ప్రారంభించగా, రూ.2 కోట్లతో 25 పూర్తయ్యాయి. రూ.8.10 కోట్లతో 16 బీటీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించగా, రూ.73లక్షలతో 4 పనుల్ని, రూ.2.98 కోట్లతో 37 పాఠశాలల ప్రహరీల నిర్మాణాన్ని ప్రారంభించగా, రూ.10 లక్షలతో 3 పనుల్ని పూర్తి చేశాం. వీటితోపాటు గుడిపాలలో రూ.22 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నాం. ఇది కూడా తుది దశలో ఉంది.

● రూ.3 కోట్ల ఎంపీ నిధులు అదనం

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు సుమారు రూ.3 కోట్ల తన ఎంపీ లాడ్స్ నిధులతో జిల్లాలో 59 పనులు మంజూరయ్యాయి. వాటిలో 33 పూర్తవ్వగా, 14 పురోగతిలో ఉన్నాయి. 12 ప్రారంభం కాలేదు. బస్ షెల్టర్లు, సీసీ రోడ్లు, కాంపౌండ్ వాల్స్, హాస్టళ్ల మరమ్మతులు వంటి పనుల్ని ఎంపీ లాడ్స్ కింద చేస్తున్నారు.



క్యాన్సర్ వ్యాధిని ముందుగా పసిగడితే జీవిత కాలాన్ని పొడిగించే వీలుందని అధ్యయనాలు చెబుతున్నాయి.అయితే భయం, సిగ్గు, నిర్లక్ష్యాలతో క్యాన్సర్ విషయంలో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. క్యాన్సర్‌ను గుర్తించే పరీక్షలు, ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నా మారుతున్న జీవనశైలి కొత్త రకం క్యాన్సర్లకు మార్గంగా మారుతోంది. చిత్తూరు జిల్లాలో అధికారికంగా నమోదైన క్యాన్సర్ బాధితుల సంఖ్య 3 వేలకు చేరువలో ఉందని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది.

చైతన్యంతోనే క్యాన్సర్ నివారణ

- వైద్య పరీక్షలతో వ్యాధి కట్టడికి ప్రభుత్వాల యత్నం
- నేడు ఇంటర్నేషనల్ క్యాన్సర్ డే

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాన్సర్ నివారణలో అవగాహనదే కీలకపాత్రగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.ఇందులో భాగంగా నాన్ కమ్యూనల్ డీసీజెస్(ఎన్‌సీడీ)పై వైద్య ఆరోగ్య సిబ్బంది ఇల్లిల్లూ తిరుగుతూ అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు చేస్తున్నారు.అనుమానిత కేసులకు సంబంధించి సంపూర్ణ వైద్య పరీక్షలు చేసి నిర్ధారణకు వస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,05,207 కుటుంబాలకు స్క్రీనింగ్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.అనుమానితులను పీహెచ్‌సీల్లో పరీక్షించారు.వీరిలో 10 మందిని తిరుపతిలోని రుయాలోని క్యాన్సర్ ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం పంపించడం జరిగిందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

● కేసుల గుర్తింపు ఇలా...

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 52, అర్బన్ ప్రాంతాల్లో 15 పీహెచ్‌సీలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్స్ 464 ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో రోజూ ఒక ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్త ఐదు ఇళ్లకు వెళ్లి స్క్రీనింగ్ చేస్తున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, హెచ్‌బీ, ఆర్‌బీఎస్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.నోటి, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. 30 ఏళ్ల పైబడిన మహిళలకు గర్భాశయ ముఖద్వార(సర్వైకల్ క్యాన్సర్)కు సంబంధించి ప్రాథమిక పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వివరాలను కమ్యూనిటీ బేస్‌డ్ అసెస్మెంట్ చెక్‌లిస్ట్(సీబాక్) యాప్‌లో నమోదు చేస్తున్నారు.అనంతరం జిల్లా ఆస్పత్రి, ఏరియా, సీహెచ్‌సీల్లో నోడల్ అధికారులు పరీక్షలు నిర్వహించి అక్కడే నయం చేయగలిగే స్థాయిలో ఉంటే వైద్యం అందిస్తున్నారు.క్యాన్సర్ తీవ్రత ఎక్కువుంటే తిరుపతిలోని రుయాస్పత్రికి సిఫార్సు చేసి అక్కడే ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.ఎన్టీఆర్ వైద్యసేవ అమలవుతున్న ఇతర ఆస్పత్రులకు పంపి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● చిత్తూరులో డే కేర్ సెంటర్ ఏర్పాటు

చిత్తూరులో క్యాన్సర్ ఆస్పత్రి లేకపోవడంతో కీమో థెరపీ కోసం ఇన్నాళ్లూ తిరుపతి, బెంగళూరు నగరాలకు వెళ్లాల్సి వచ్చేది.ఈ నేపథ్యంలో ఇటీవలే కేంద్ర ప్రభుత్వ నిధులతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో 20 బెడ్లతో క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.మందుల కోసం రూ.3 లక్షలతో ఆర్డర్ పెట్టారు.త్వరలోనే పూర్తిస్థాయి వైద్యులను నియమించి చికిత్సలు ప్రారంభించనున్నారు.

జిల్లాలో అనుమానిత కేసుల వివరాలు

- ఓరల్ క్యాన్సర్ - 1258
- బ్రెస్ట్ క్యాన్సర్ - 180
- సర్వైకల్ కాన్సర్ -801



మూడు నెలలకోసారి పరీక్షలు



క్యాన్సర్ బారిన పడుతున్న వారిలో అధికంగా మహిళలే ఉన్నారు. ఎక్కువగా 30 ఏళ్ల దాటిన మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారు.కాబట్టి మూడు నెలలకోసారి నిర్లక్ష్యం చేయకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి.క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి చికిత్సలందిస్తే బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అవగాహన ప్రజల్లో రావాలి.భయం వీడి పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే క్యాన్సర్‌ను జయించగలం.

-ప్రభావతి,డీసీహెచ్ఎస్

లగేజీ వ్యాను బోల్తా

- తాపీ మేస్త్రి దుర్మరణం, పలువురికి గాయాలు




వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



గాయపడిన మహిళ

శ్రీరంగరాజుపురం/ వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లగేజీ వ్యాను బోల్తా పడటంతో ఎస్‌ఆర్‌పురం మండలం పాతపాళ్యం కాలనీకి చెందిన వెంకటేష్(35) దుర్మరణం చెందాడు. అదే గ్రామానికి చెందిన పలువురు గాయపడ్డారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. పాతపాళ్యం కాలనీకి చెందినవారు గంగాధరనెల్లూరు మండలం ఎట్టేరి గ్రామానికి లగేజీ వ్యానులో సోమవారం బయల్దేరారు. ఎస్‌ఆర్‌పురం మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో సిద్ధమనాయుడు మ్యాంగో గార్డెన్ వద్దకొచ్చేసరికి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేష్(35) అక్కడికక్కడే మృతి చెందారు. విజయ(42) తీవ్రంగా గాయపడగా, ప్రభాకర్(38), సింబు(20), వజ్రమ్మ(51), మాణిక్యమ్మ(62), జాన్(20), సుగుణమ్మ(48), నాగేష్(32), సరిత(22), విజయ(43), పండు(18), పెద్దబ్బ(52), కుప్పయ్య(27), రాధమ్మ(52), సోమయ్య(62), మురళి(45), భీమయ్య(37), జాన్సీ(39), రాజేష్(42), గోవింద్(16) తదితరులు గాయపడ్డారు. బాధితులంతా ఎస్‌ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. అనంతరం కొందరిని చిత్తూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుల బంధువులు అధిక సంఖ్యలో పీహెచ్‌సీ వద్దకు చేరుకున్నారు. దీంతో వారి ఆర్తనాదాలతో పీహెచ్‌సీ ఆవరణం దద్దరిల్లింది. మరోవైపు పాతపాళ్యంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



108 అంబులెన్స్ కోసం నిరీక్షిస్తున్న జనం

అంబులెన్స్‌ల రాక ఆలస్యంతో రోడ్డుపైనే వైద్యం

మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి గాయపడ్డవారిని తరలించాలని 108 అంబులెన్స్‌లకు సమాచారం ఇచ్చారు. అయితే అవి సకాలంలో రాలేదని బాధితుల బంధువులు మండిపడ్డారు. సమాచారం ఇచ్చిన గంట దాటాక వచ్చాయన్నారు. అప్పటికే కొందరిని ఇతర వాహనాల్లో తరలించామని తెలిపారు. మరోవైపు తీవ్రంగా గాయపడ్డ విజయను 108 అంబులెన్స్‌లో చిత్తూరుకు తరలించాలని ముందుగా ప్రయత్నించామన్నారు. అంబులెన్స్ రాక ఆలస్యమవడంతో ఆమెకు పీహెచ్‌సీ ఎదుట రోడ్డుపైనే డాక్టర్ గిరి, స్టాఫ్ నర్సు నీరజ వైద్యం చేయాల్సి పరిస్థితి వచ్చిందని వాపోయారు.



పీహెచ్‌సీ ఎదుట రోడ్డుపైనే వైద్యం అందిస్తున్న సిబ్బంది

కానిస్టేబుల్ వైఖరిపై నిరసన

అంబులెన్స్ సకాలంలో రాక ఆలస్యమవడంతో బాధితుల బంధువులు ఆగ్రహించగా, అక్కడున్న ఓ కానిస్టేబుల్ వారితో దురుసుగా ప్రవర్తించాడని స్థానికులు ఆరోపించారు. పైగా దూషించాడంటూ బాధితుల బంధువులు పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు.

56మంది 'ఎండీయూ' ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని 56 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జనవరి నెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేల జీతం, వారి సహాయకులకు రూ.3వేల జీతం ప్రభుత్వం చెల్లిస్తోందని డీఎస్వో శంకరన్ తెలిపారు.

రేపట్నుంచి ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో బుధవారం నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సయ్యద్‌మౌల తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మూడు స్పెల్స్‌లో ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. ఫస్టు స్పెల్ కింద జిల్లా వ్యాప్తంగా 40 ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లోని 2వేల మంది విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఈఎల్స్ వివరాలు 15లోగా పంపండి


- ఖజానాశాఖ డీడీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఎర్న్‌డ్ లీవుల (ఈఎల్స్) వివరాలు ఈనెల 15వ తేదీలోగా పంపాలని జిల్లా ఖజానా శాఖ డీడీ రామచంద్ర ఆదేశాలు జారీ చేశారు. 2025 జనవరి 1వ తేదీనాటికి ప్రతి ఉద్యోగికి సంబంధించి నిల్వ ఉన్న ఈఎల్స్ వివరాలను సర్వీసు రిజిస్టర్లను పరిశీలించి పంపాలని ప్రభుత్వశాఖల డీడీవో (డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్లు)లకు సూచించారు. అలాగే డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి హైయర్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ కలిగి కిందిస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లిస్తున్న అడ్వాన్స్ ఇంక్రిమెంట్ వివరాలను సైతం పంపాలన్నారు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మాజీ సైనికుల వివరాలను కూడా పంపాలని పేర్కొన్నారు.

మంచు దుప్పట్లో...



సోమలలో..





చిత్తూరులో..

ఇప్పుడిప్పుడే చలి తగ్గి ఎండలు చురుగ్గా కాయడం మొదలైంది.అయితే చిత్తూరు నగరాన్ని సోమవారం ఉదయం మంచు దట్టంగా కమ్మేసింది. నాలుగైదు రోజులుగా చలి తగ్గినప్పటికీ.. ఉదయం 7 గంటలైనా రోడ్లు కనపడకుండా మంచు అలుముకుంటోంది.దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సివచ్చింది. సోమలలో కూడా సోమవారం ఉదయం 8గంటలు దాటినా మంచు కురుస్తూనే వుండడంతో పనులకు వెళ్లలేక ప్రజలు ఇబ్బందిపడ్డారు.ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, చిన్నఉప్పరపల్లె, వల్లిగట్ల తదితర అటవీ శివారు పంచాయతీల్లో 9గంటల వరకూ పొగమంచు కమ్మేసింది. మధ్యాహ్నం 11 గంటల నుంచి ఎండ తీవ్రంగా కాసింది.

- చిత్తూరు/సోమల, ఆంధ్రజ్యోతి

ప్రయాగ్‌రాజ్‌లో ఊంజల్‌సేవ



ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాసస్వామికి ప్రత్యేక ఊంజల్‌సేవను నిర్వహించారు. స్వామివారు వీణాపాణియై సరస్వతి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో వార్షిక విశేషపూజ



తిరుమల శ్రీవారి ఆలయంలో వార్షిక విశేషపూజను సోమవారం వసంతపంచమి పర్వదినం సందర్భంగా నిర్వహించారు. గతంలో వారపు సేవగా విశేషపూజను నిర్వహించేవారు. అయితే శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే సూచనతో దీనితోపాటూ వసంతోత్సవం, సహస్ర కలశాభిషేకంలను వార్షిక సేవలుగా గత టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఈమేరకు తొలిసారి వార్షి విశేషపూజను సోమవారం శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఈపూజలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


పెరిగిన రద్దీ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,706

తలనీలాలు సమర్పించినవారు: 23,340





ఇక బాజాభజంత్రీల మోత

మాఘమాసం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడనక్కరలేదు. నవ వధూవరులు పెళ్లి పీటలెక్కేందుకు రోజులు లెక్కపెట్టనక్కరలేదు. మాఘమాసం వచ్చేసింది. సుమూహూర్తాల మూటను మోసుకొచ్చేసింది. నిశ్చితార్థమయిన వారి ఇంట పెళ్లి సందడి తెచ్చేసింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈమాసానికి ఎంతో ప్రాధాన్యముందని ప్రగాఢంగా ప్రజలు విశ్వసిస్తారు. అందుకే మాఘమాసం వివాహాది శుభకార్యాలకు పెట్టింది పేరు. పెళ్లిళ్లు, అక్షరాభ్యాసాలు, నామకరణాలు లాంటివి ఈరోజుల్లోనే చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. పెళ్లిళ్లయితే అన్నీ ఇన్నీ కాదు. ఈ సారి కూడా తిరుపతి నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గణనీయంగానే ఉంది. ముందుగానే కల్యాణమండపాలు బుక్కయిపోయాయి. పేరున్న పురోహితులంతా బిజీబిజీనే. కేటరింగ్ నుంచి బాజాభజంత్రీల వారివరకూ అందరూ ఒప్పందాలు కుదుర్చేసుకున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి మార్చి 16 వరకూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఈఏడాది జూలై వరకూ కొన్ని ముహూర్తాలున్నాయంటున్నారు. నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభ కార్యాలు జరపుకొనేందుకు అవకాశం వచ్చిందంటున్నారు. ఈ క్రమంలో మాఘ మాసంలో పెళ్లిళ్లకు హడావుడి మొదలైపోయింది. వివాహంతో ముడిపడిన వివధ వర్గాల వారు ఏమంటున్నారో ఒకసారి తెలుసుకుందాం...

- తిరుపతి,నేరవిభాగం (ఆంధ్రజ్యోతి)

- ప్రవేశించిన మాఘమాసం
- ఈనెల 2 నుంచి సుముహూర్తాలు
- బుక్ అయిపోయిన కల్యాణ మండపాలు
- మొదలైన పెళ్లి సందడి

స్థాయిని బట్టి డెకరేషన్

పెళ్లంటే ఇప్పుడు అంతా అట్టహాసమే. ఒకప్పుడు సాదా సీదాగా చేసుకుని వెళ్ళే వారు. గతంలో కల్యాణ మండపాల్లో వేదిక డెకరేషన్ కోసం మహా అయితే రూ.30వేలు ఖర్చు పెట్టేవారు. కానీ రోజులు మారిపోయాయి. ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైరైటీ డెకరేషన్లపై ఆసక్తి చూపిస్తున్నారు. కనిష్ఠంగా రూ.50వేలయినా ఇందుకు కేటాయిస్తున్నారు. అక్కడ నుంచి స్థాయి,స్థోమతును బట్టి ఈ మొత్తం పెరిగిపోతోంది. రూ.2.50 లక్షలకు పైబడి ఎంతైనా వెచ్చించడానికి వెనుకాడటంలేదు. దీనికితోడు అన్ని రకాల మెటీరియల్ ధరలు పెరిగిపోయాయి. పూల ధలరను మరీనూ. బెంగళూరు నుంచి కొన్నిరకాల పుష్పాలను తెప్పిస్తున్నాం. మెహంది రకం పూల ఖరీదు బాగా పెరిగిపోయింది. వేదిక అలంకరణతో మెప్పించాలని పెళ్లివారు కోరుకుంటున్నారు.

- అరుణ డెకరేటర్, తిరుపతి



ఈ నెల ఎంతో శుభప్రదం



పురోహితులకు మాఘమాసమంతా బిజీగానే ఉంటుంది. ఈమాసానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఈనెలలో ఏ శుభకార్య క్రమం చేసినా విష్ణుఆరాధనతో సమానం. వైవాహిక జీవితం సాఫీగా సాగుతుందని బలమైన నమ్మకం. అందుకే శుభకార్యాలెక్కువగా ఈనెలలోనే చేస్తుంటారు. ఈసారి మాఘమాసంలోపెళ్లిళ్లు చేసుకోడానికి మంచి ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నెల 31 నుంచి మార్చి 16 వరకు ముహూర్తాలు ఉన్నాయి. ప్రధానంగా ఫిబ్రవరి 2,3,7,13,14,15,18,19,20,21,23,25లతోపాటు మార్చిలో 1,2,6,7,12,16 తేదీల్లో ఎక్కువ వివాహాలు జరుగుతాయి.

- రామశర్మ,పండితుడు, తిరుపతి

ఈవెంట్ మేనేజర్లదే హవా



ఒకప్పుడు స్థానిక ఫోటో, వీడియో గ్రాపర్లకు డిమాండ్ వుండేది. ఇప్పుడు ఈవెంట్ మేనేజర్లు అందుబాటులోకి వచ్చారు. ఎక్కడో కూర్చుని భోజనాలు మొదలుకుని, ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల వరకూ అన్ని పనులూ చేస్తామని ఎంగేజి చేసుకుంటున్నారు. ఖరీదైన స్టిల్ వీడియోలు అడుగుతున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని నైపుణ్యాలు ఉంటేనే ఈ రంగంలో రాణింపు ఉంటోంది. ఈతరహా ఈవెంట్‌లు చేసే వారు ఎక్కువగా విజయవాడ, తిరుపతి, బెంగళూరు వంటి నగరాల నుంచి వస్తున్నారు. కల్యాణ మండపాలను వారే లీజుకు తీసుకుని మరీ నిర్వహిస్తున్నారు. పెళ్లి చేసేవారు కూడా ఖర్చుకు వెనకాడటంలేదు.



- మురళి, ప్యాషన్ స్టూడియో, తిరుపతి



రుచి నాణ్యతల కోసం ఎన్ని కష్టాలో..

క్యాటరింగ్ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. రుచికి,నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహ భోజనంబు అన్నట్లుగా భోజనం బాగుంటే పెళ్లిబాగా అయినట్లు పెళ్లివారు భావిస్తుంటారు. దీంతో మామీద విపరీతమైన ఒత్తిడి ఉంటోంది. భోజనం బాగుందని తిన్నవారు చెబితే అదే మాకు పెద్ద పబ్లిసిటీ. అందుకోసమే చాలా తాపత్రయపడుతుంటాం. నిత్యావసర ధరలు పెరిగినా సరకులు



నాణ్యత లేక కస్టమర్లను సంతృప్తి పర్చడానికి చాలా కష్టపడాల్సి వస్తోంది. కమ్మని రుచితో ఘుమఘుమలాడే నెయ్యి దొరకడం గగనమైంది. ప్రస్తుత నూనెల పరిస్థితీ అలాగే ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈ పనిలో నైపుణ్యత ఉన్న మనుషులు దొరకడంలేదు. ప్రస్తుతం వెయ్యి మందికి భోజనాలు ఆర్డర్లు ఇవ్వడం కష్టంగా ఉంది. మాకూ పోటీ పెరిగింది. అయినా మాఘమాసం కదా. అందరికీ చేతినిండా పని.

- చలపతి, అన్నపూర్ణ క్యాటరింగ్ సర్వీసు



పీజీఆర్ఎస్ వినతులు 220

● అధికారుల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 220 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూకు సంబంధించి 116 అర్జీలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చారు. 10.30 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ వచ్చారు. అప్పటికీ వివిధ శాఖల ఉన్నతాధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో ఆయన ఒకింత అసహనానికి గురయ్యారు. సమయానికి రాని అధికారుల నుంచి సంజాయిషీ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మాండ్, దేవేంద్రరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



అధికారులు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

తిరుపతి అర్బన్ కొరమేనుకుంట దేముడు కాలనీలో నివసిస్తున్న ఎరుకుల, యానాదుల కుటుంబాలకు కరెంటు మీటర్లు, ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్



చేశారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆ ప్రాంతంలో 20ఏళ్లకు పైగా 130 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారని, వారికి కరెంటు మీటర్లు, మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, శివ, పద్మనాభరెడ్డి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

సంఘమిత్ర మా సొమ్ము కాజేసింది

'మేము మహిళా పొదుపు సంఘంలో ఉన్నాం. తొట్టంబేడు యూనియన్ బ్యాంకులో రుణం తీసుకున్నాం. ప్రతినెలా రుణ సొమ్మును బ్యాంకులో జమచేయమని సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్‌కు ఇచ్చాం.వారు ఆ నగదును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా వాడుకున్నారు.న్యాయం చేయండి' అంటూ తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

పక్క రాష్ట్రాల మద్యం తెచ్చి విక్రయిస్తున్నారు



ఏర్పేడు మండలం పరమాలపల్లికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి బాలరాజు పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తూ యువతను చెడుదారి పట్టిస్తున్నాడని, జాతీయ రహదారికి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా గదులు నిర్మించారని గ్రామస్తులు హరికృష్ణ, మల్లికార్జున కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్వామీ.. నీ దర్శనం కోసం







మంగళవారం జరిగే రథసప్తమి వేడుకల్లో సప్తవాహనాలపై స్వామివారిని దర్శించుకునేందుకు సోమవారమే తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లో.. శ్రీవారి ఆలయం ముందు నిద్రిస్తున్న భక్తులు - మలయప్ప ఊరేగింపు సేవ కోసం సిద్ధమైన సూర్యప్రభ వాహనం



క్యాన్సర్ నిర్మూలన దిశగా అడుగులు

● జిల్లాలో జోరుగా స్ర్కీనింగ్ పరీక్షలు ● స్విమ్స్, రుయాలో ప్రత్యేకవార్డులు

● నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా స్ర్కీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు స్విమ్స్ ఆధ్వర్యంలో 11,554మందికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించగా 1850మందిని అనుమానితులుగా గుర్తించారు. స్వీకర్ ఆధ్వర్యంలో 48వేల మందికి పరీక్షలు నిర్వహించగా 573 మంది అనుమానితులను గుర్తించారు.

మూడు చోట్ల సేవలు

స్విమ్స్ ఆవరణలోని బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో 30 పడకలతో పెయిన్, పాలియేటివ్ కేర్ వార్డును అందుబాటులోకి తీసుకువచ్చారు. చివరి దశ రోగులకు తొలుత చికిత్స అందించనున్నారు. టాటా ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్(స్వీకర్), రుయాలో 10 పడకల పాలియేటివ్ కేర్ కేంద్రం క్యాన్సర్ రోగులకు విశేష వైద్య సేవలందిస్తున్నాయి. స్విమ్స్ పాలియేటివ్ కేర్ వార్డులో ఆరోగ్యశ్రీ వర్తించదు. దీనిని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు బీఐవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి తెలిపారు.

కేర్ ట్రాకర్ యాప్ ద్వారా సలహాలు

కేర్ ట్రాకర్ యాప్ క్యాన్సర్ రోగులకు ఉపయోగపడుతోంది. స్విమ్స్‌లో చికిత్స పొందిన వారి ఫోన్‌లో మొదట ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ కలిగిన రోగుల, వారి సహాయకుల ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రోజు వారి ఆరోగ్య పరిస్థితిని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను వైద్య బృందం పరిశీలిస్తుంది. అవసరమైతే వెంటనే వైద్య సలహాలను అందిస్తారు. లేదా ఆస్పత్రికి రావాల్సింగా సూచిస్తారు.



ఉపశమనం కోసమే పాలియేటివ్ కేర్

పాలియేటివ్ కేర్ వార్డును క్యాన్సర్ బాధితులకే కాకుండా న్యూరాలజి, నెఫ్రాలజి, సీవోపీడి బాధితులకు కూడా అందుబాటులోకి తీసుకువస్తాం. వ్యాధి ముదిరి చివరి దశలో ఉన్న వారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సి ఉంటుంది. వారికి నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరం ఉంటుంది. అలాంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తాం

- డాక్టర్ ప్రాణబంధుదాస్, రేడియోషన్, అంకాలజి వైద్య నిపుణులు

దారి దోపిడీ కేసులో ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్టు

● 24 గ్రాముల బంగారు నగలు, రెండు ఆటోలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిని బెదిరించి బంగారు నగలు లాక్కెళ్లిన ఘటనలో ఇద్దరు ఆటో డ్రైవర్లను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ మురళీ మోహన్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కాట్పాడికి చెందిన గోవిందరాజులు సురేష్‌బాబు గత నెల 12న తిరుమలకు వచ్చారు. తిరుపతికి వచ్చిన ఈయన ఆటో ఎక్కారు. ఆ ఆటో డ్రైవరు మునస్వారు శివాజీ.. కొంత దూరం వెళ్లాక చెన్నారెడ్డి కాలనీకి చెందిన మరో ఆటో డ్రైవర్ చిన్నస్వామి కిరణ్‌కు ఫోన్‌చేసి రప్పించాడు. వీరిద్దరూ కలిసి సురేష్‌బాబును చితకబాది 24 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అనిల్‌కుమార్, ఏఎస్‌ఐ వెంకటరత్నం, సిబ్బంది నిందితుల కోసం గాలించారు. ఆటో డ్రైవర్లు వాడుతున్న మొబైల్ నెంబర్ల ఆధారంగా ట్రాక్ చేసి సోమవారం సైన్సు సెంటరు వద్ద శివాజీ, చిన్నస్వామి కిరణ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, రెండు ఆటోలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని సీఐ చెప్పారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

13 కిలోల గంజాయి పట్టివేత

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. నెల్లూరు రూరల్ మండలం అల్లిపురం మేకలవారి తోటకు చెందిన సాన విష్ణుమోహన్ రెడ్డి, తమిళనాడుకు చెందిన ఆర్.పాండ్యన్‌లు విజయవాడ నుండి మదురై తరలించేందుకు 13 కేజీల గంజాయిని ఆదివారం పాకాల రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సమాచారం తెలుసుకుని సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్‌ఐ సంజీవరాయుడు, తహశీల్దార్ సంతోష్‌సాయి పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని గంజాయి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు.



నిందితులతో సీఐ సుదర్శన ప్రసాద్, పోలీసులు

17 నుంచి తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో

● పాల్గొననున్న 58 దేశాల ప్రతినిధులు

తిరుమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో 2025 కార్యక్రమం తిరుపతిలో ఈ నెల 17 నుంచీ మూడు రోజులపాటూ జరగనుంది. ంగళంరోడ్డులోని ఆశా కన్వెన్షన్‌లో సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ నిర్వహణపై నిపుణుల చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు.. ఈ సదస్సులో ఉంటాయి. 58కి పైగా దేశాల నుంచి 1,500 మంది హిందు, సిక్కు, బౌద్ధ, జైన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారు. 2023లో తొలిసారిగా అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) వారణాశిలో జరిగింది. ప్రధాని నరేంద్రమోదీతో పాటు హోంమంత్రి అమిత్‌షా వంటి ప్రముఖులు పాల్గొన్నారు. రెండవ ఎక్స్‌పో తిరుపతిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్‌లాల్, టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరీష్ కులకర్ణి నేతృత్వం ఈసదస్సు జరుగనుంది.

చిరుత సంచారంతో..!

● ఎస్వీయూ లైబ్రరీ వెనుక చెట్ల పొదల తొలగింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిరుత సంచారం నేపథ్యంలో ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వెనుక గల చెట్ల పొదలను సిబ్బంది తొలగిస్తున్నారు. లైబ్రరీ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేస్తున్నారు. చిరుత పులి ఇటీవల లైబ్రరీ వెనుక జింకను చంపి తినడం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. దీంతో లైబ్రరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు. లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, గార్డెనింగ్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ కోటగారం మురళి నేతృత్వంలో రెండు, మూడు రోజులుగా లైబ్రరీ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తద్వారా చిరుత భయంతో వణుకుతున్న విద్యార్థులు, ఉద్యోగులకు కొంత ధైర్యం కలిగేలా చేస్తున్నారు.

రేపు ఎస్వీయూలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఖాళీగా ఉన్న ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. ఈఏపీసెట్-24 అర్హత కల్గిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుకున్న వారు అర్హులని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 52 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను పోలీసులకు వివరించారు.

ఏడాదిలోగా అర్హులందరికీ టిడ్కో ఇళ్లు



టిడ్కో చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఏడాదిలోగా టిడ్కో ఇళ్లు అందజేస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం వెంకటగిరిలోని టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో ముఖాముఖీ నిర్వహించారు. నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చాలన్న ధ్యేయంతో గతంలో సీఎంగా చంద్రబాబు 4.52 లక్షల టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ఆ సంఖ్యను 2.16 లక్షలకు కుదించారన్నారు. పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు టిడ్కో ఇళ్ల రుణాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్లలో యజమానులు నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తే రద్దు చేయించి బాడుగకు ఉన్నవారికే కేటాయిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, జంపాల ప్రకాష్, కస్తూరి, గునకల కిషోర్, రామారావు అనిల్‌కుమార్, రాదమ్మ, చిరంజీవి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు కోసం సెల్ టవర్ ఎక్కేశాడు!



ప్రసాదరెడ్డి



సెల్ టవర్ ఎక్కుతున్న ప్రసాదరెడ్డి

రామకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):రెండేళ్ళ క్రితం పరుగుపందేల్లో తప్పి పోయి మరో గ్రామంలో ఉందను కుంటున్న తన ఎద్దును అప్పగించాలంటూ ఓ రైతు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. రామకుప్పం మండలం మణీంద్రం గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డి రెండేళ్ళ క్రితం గ్రామంలో జరిగిన పరుగుపందేల్లో తన ఎద్దును పరుగులు తీయించాడు. అది అప్పుడు తప్పిపోయి కన్పించకుండా పోయింది. ప్రసాదరెడ్డి ఎద్దు కోసం పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం కెంపసముద్రం గ్రామంలో జరిగిన పరుగు పందేల్లో కన్పించిన ఓ ఎద్దు తనదంటూ ఆ ఎద్దును తీసుకువచ్చిన రైతుతో వాగ్వాదానికి దిగాడు.గోవిందరాజపురానికి చెందిన వ్యక్తి వద్ద తన ఎద్దు ఉందని సోమవారం రామకుప్పం పోలీసులను ఆశ్రయించి, తనకు న్యాయం చేయాలని కోరాడు. పోలీసులు పెద్దమనుషులను గోవిందరాజపురం పంపి, ప్రసాదరెడ్డి చెప్పిన ఆనవాళ్ళు ఆ ఎద్దులో ఉన్నాయో లేదో తేల్చాలని సూచించారు. ఎద్దును పరిశీలించిన పెద్దలు ప్రసాదరెడ్డి చెప్పిన ఆనవాళ్ళేవీ ఆ ఎద్దులో లేవని నిర్ధారించారు.ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ నెంబరు 112కు, పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసిన ప్రసాదరెడ్డి తనకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశాడు. సోమవారం మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో పోలీస్టేషనుకు దగ్గర్లోనే వున్న సెల్‌టవర్ ఎక్కాడు.పోలీసులు, రెవిన్యూ సిబ్బంది, పెద్దమనుషులు ఎంతగా చెప్పినా కిందకు దిగలేదు.సాయంత్రం 6గంటలైనా కిందికి దిగిరాకపోవడంతో పోలీసులు అతన్ని బలవంతంగా దించేందుకు కుప్పం నుంచి అగ్నిమాపక వాహనాన్ని తెప్పించారు. ఆ వాహనాన్ని చూడగానే ఏమైందో ఏమో 6.30గంటలకు ప్రసాదరెడ్డి కిందకు దిగి స్టేషను వద్దకు చేరుకున్నాడు. ప్రసాదరెడ్డి తనదంటున్న ఎద్దుకు పశువైద్యాధికారులతో పరీక్షలు నిర్వహించి,ఓ నిర్ణయం తీసుకుంటామని సీఐ మల్లేష్‌యాదవ్ నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

ఎస్వీయూలో ఫార్మసీ కోర్సులకు రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఖాళీగా ఉన్న ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. ఈఏపీ సెట్-24 అర్హత కల్గిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుకున్న వారు అర్హులని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

వీసీ వడ్డిపల్లి వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం



మామిడితోట కంచె కూసాలను విరిచేసిన ఒంటరి ఏనుగు

కల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ వీసీ వడ్డిపల్లి వద్ద ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. భీమవరం అటవీప్రాంతం చీటీగలకోన నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు పోశం వారిపల్లి సమీపానికి చేరుకుంది. అక్కడి నుంచి వీసీ వడ్డిపల్లి వద్దకు చేరింది. వీసీ వడ్డిపల్లిలోని రైతులు చంద్రబాబుకు చెందిన వరి, వాణికి చెందిన చెరుకు, లోకేష్‌కు చెందిన వంకాయ పంటను ధ్వంసం చేసింది. ఇదే గ్రామానికి చెందిన రైతులు గోవిందు, వెంకటేష్ మామిడితోట కంచెకు ఏర్పాటుచేసిన రాతికూసాలను విరిచేసింది. ఏనుగు దాడిలో ధ్వంసమైన ప్రాంతాలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి పరిశీలించారు. ఒంటరి ఏనుగు అక్కడి నుంచి కల్లూరుపాళెం పంచాయతీ సమీపంలోని అడవివైపు వెళ్ళినట్లు ఆయన తెలిపారు.

ఏనుగులను తమిళనాడువైపు మళ్లించాం

అటవీశాఖ అధికారులు



మాట్లాడుతున్న అటవీ అధికారులు

గుడిపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా గుడిపాల మండలంలో హల్‌చల్ చేసిన ఏనుగులను తమిళనాడువైపు మళ్లించామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వెప్పాలమానుచేను, పానాటూరు, చిత్తపార తదితర గ్రామస్తుల పొలాలపై ఏనుగుల పడి.. పంటలను ధ్వంసం చేశాయి. దీంతో డిప్యూటీ రేంజ్ అధికారి ఆనందరెడ్డి తన సిబ్బందితో కలిసి ఏనుగులను సోమవారం తమిళనాడు ఫారెస్ట్ వైపు మళ్లించారు. దాంతో ఆయాల గ్రామాలవారు ఊపిరిపీల్చుకున్నారు. ఇన్‌చార్జి బీట్ అటవీ అధికారి డిల్లీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉనికి కోసమే కేంద్ర బడ్జెట్‌పై వైసీపీ ఆరోపణలు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ ఉనికి కోసమే కేంద్ర బడ్జెట్‌పై వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రం ఏమీ సాధించలేక పోయిందని అసత్య ప్రచారాలు చేయడం వారి అవగాహన లోపమేనని చెప్పారు. జగన్ పాలనలో 21 మంది ఎంపీలున్నపుడు ఏమి సాధించారో ప్రజలకు చెప్పాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి వచ్చిన నిధులకంటే ఎక్కువగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సీఎం చంద్రబాబు తీసుకురాగలిగారని తెలిపారు. దీనిపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15వేల కోట్ల ఆర్థిక సాయం చేసిందని, పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. ఏడు నెలల్లోనే రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. వైసీపీ నేతలు చేసే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్, గిరిబాబు నాయుడు పాల్గొన్నారు.

పట్టపగలే టీచర్ ఇంట్లో చోరీ

బంగారు, నగదు అపహరణ



బీరువాలో చిందరవందరగా బట్టలు

కుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో సోమవారం పట్టపగలే ఒక ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. పట్టణంలోని ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలోని ఉపాధ్యాయులైన గణపతి దంపతులు ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండ డం కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు పగులగొట్టి వస్తువులు ఇల్లంతా చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 500 గ్రాముల బంగారు, రెండు కిలోల వెండి, రూ.2లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు కుప్పం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని మరో ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు సమాచారం.

డిప్యూటీ మేయర్ ఎన్నిక నేటికి వాయిదా

కోరం లేకపోవడంతో అధికారుల నిర్ణయం

- ఎస్వీయూ వద్ద మధ్యాహ్నం దాకా ఉద్రిక్తత
- తమ కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారంటూ వైసీపీ ఆందోళన
- అలాంటిదేమీ లేదంటూ సభ్యుల వీడియో ప్రకటన



సెనేట్ హాలులోపల ఎన్నికల అధికారి శుభం బన్సల్, ఎమ్మెల్యే ఆరణి, కూటమి మద్దతుదారు కార్పొరేటర్లు



ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద వైసీపీ కార్పొరేటర్ల బస్సు వచ్చే సమయంలో రెండు వర్గాలు గుమికూడటంతో నెలకొన్న ఉద్రిక్తత

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనేక నాటకీయ పరిణామాలకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగాలి. అందుకు ఎస్వీయూ సెనేట్ హాలులో ప్రిసైడింగ్ అధికారి , జేసీ శుభం బన్సల్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు. 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులున్నా 22 మంది మాత్రమే ఎన్నికకు హాజరయ్యారు. 50 శాతం కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా అనివార్యమైంది.

హాలులో 22 మంది

ఎస్వీయూ సెనేట్ హాలులోకి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వైసీపీ రెబల్ కార్పొరేటర్లతో పాటు కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ, మరికొందరు వచ్చారు. అరగంట తర్వాత ఎక్స్‌అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రావడంతో మొత్తం 22 మంది సభ్యులు ఎన్నికకోసం వేచిచూశారు.ఈలోపు వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఇంటి నుంచి 23మంది వైసీపీ కార్పొరేటర్లతో బస్సు బయలుదేరగా.. ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కూడా వచ్చారు.ఎస్వీయూ మెయిన్ గేటు సమీపంలోకి వచ్చేసరికి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల వాళ్లు పెద్దసంఖ్యలో మోహరించారు. ఇంతలో బస్సు డోరు అద్దాలు పగిలాయి. ఈ గొడవలో ఐదుగురు కార్పొరేటర్లు బస్సు దిగి వెళ్లిపోయారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. వైసీపీ కార్పొరేటర్లను ఎస్వీయూ మెయిన్ గేటునుంచి లోపలకు వెళ్లే ఏర్పాట్లు చేశారు. 17 మంది గేటు లోపలకు వెళ్లారు. మరో ఇద్దరు గైర్హాజరు కాగా, ఓ మహిళా కార్పొరేటర్ అస్వస్థతతో వెనుదిరిగారు.

భూమన ఫోనుతో యూటర్న్

మరికొద్ది క్షణాల్లో వైసీపీ కార్పొరేటర్లు సెనేట్ హాలుకు చేరుకోబోతుండగా ఎంపీ గురుమూర్తికి భూమన కరుణాకర్ రెడ్డి ఫోనుచేశారు. ఆ వెంటనే వైసీపీ కార్పొరేటర్లతో కలిసి ఆయన వెనుదిరిగారు. ఓటింగుకు హాజరైతే సంఖ్యాబలం ప్రత్యర్థులకే ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళ్లారని ఆరోపిస్తూ ఎన్నికను బహిష్కరిస్తే కోరం లేక వాయిదా పడుతుందని భూమన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్ ఇతర కార్పొరేటర్లు వెనక్కి వచ్చి ఏడీ బిల్డింగ్ సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై కూర్చున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 నుంచి 12 గంటల్లోపు ఎన్నిక జరగాలి. మరికొంత సమయం కావాలని డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ పలుసార్లు అభ్యర్థించారు. కోరం లేకపోతే నిబంధనల మేరకు గంట సమయం మాత్రమే ఉంటుందని, వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు

కూటమి నేతలు తమని కిడ్నాప్ చేశారని వస్తున్న వార్తల్లో నిజంలేదని, తామంతా సురక్షితంగా ఉన్నామని కార్పొరేటర్లు అమరనాథరెడ్డి, అనీష్ రాయల్, అనిల్, మోహన్ కృష్ణ యాదవ్ తెలిపారు. తమ కార్పొరేటర్లపై దాడి చేసి కిడ్నాప్ చేశారన్న వైసీపీ నేతల ఆరోపణలపై వీరు సెల్ఫీ వీడియోల ద్వారా స్పందించారు. ఎన్నికకు వెళుతున్న సమయంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భయపడి తాము సురక్షితంగా ఉన్నామన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

కార్పొరేటర్లకు కునుకేదీ?

డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్పొరేటర్లకు కునుకులేకుండా చేస్తోంది. ముఖ్యంగా కొత్త మహిళా కార్పొరేటర్లు అసహనంగా నలిగిపోతున్నారు. క్యాంపు రాజకీయాల్లో భాగంగా పలు చోట్ల హోటళ్లలో బస చేస్తున్న చోట్లకు అటు కూటమి.. ఇటు వైసీపీ నేతలు పోటాపోటీగా చేరుకుంటున్నారు. అర్ధరాత్రి వేళ వారిని నిద్రలేపి చిన్నపిల్లలున్నా పట్టించుకోకుండా నానా యాగీ చేస్తున్నారు. సోమవారం ఎన్నికకు ముగింపు కార్డు పడుతుందనుకునేలోపు మళ్లీ వాయిదాపడడంతో వీరంతా నోరెళ్లబెట్టారు. మళ్లీ ఎవరి దారిన వారు క్యాంపులకు పయనమయ్యారు.



ఎస్వీయూ ఏడీ భవనం వెలుపల మేయర్ శిరీష, వైసీపీ కార్పొరేటర్లు

కార్పొరేటర్లు వెళ్లే బస్సుకు భద్రత కల్పించండి

- తిరుపతి ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం, డీజీపీ, జిల్లా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ వైసీపీ జనరల్ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డి, 40వ వార్డు కార్పొరేటర్ టి.భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. పిటిషన్‌ను లంచ్‌మోషన్‌గా స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత.. ఎస్వీయూలోని సెనేట్ హాల్‌కు వెళ్లేందుకు కార్పొరేటర్లు వినియోగించే బస్సుకు పోలీసు భద్రత కల్పించాలని ఎస్పీని ఆదేశించారు. భద్రత కల్పించాలని కోరుతూ ఎస్పీకి సమర్పించే వినతిపై ఆ బస్సులో ప్రయాణించే కార్పొరేటర్ల సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. డిప్యూటీ మేయర్ ఎన్నికకు వెళ్లే సమయంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లపై అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడే ప్రమాదం ఉందన్నారు.

అంటు కట్టు పద్ధతిలో సాంకేతిక విప్లవం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అధికారులు

కుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంటు కట్టు పద్ధతిలో పలురకాల అత్యాధునికమైన సాంకేతిక విప్లవం వచ్చిందని, తద్వారా రైతులకు మరింత మేలు చేకూరుతుందని ఇండో ఇజ్రాయిల్ టెక్నాలజీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్ అన్నారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (పువ్వులు, కూరగాయలు)లో సోమవారం కూరగాయలను అంటుకట్టే విధానంలో నూతన సాంకేతిక పద్ధతులపై (హైడ్రోఫోనిక్స్) జాతీయ స్థాయి మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మదేవ్ మాట్లాడుతూ కుప్పం సీవోఈలో అమలయ్యే సాంకేతిక పద్ధతులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. జాతీయ స్థాయిలో అంటుకట్టే విధానాన్ని ప్రోత్సహించి దేశంలోని రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో 12 రాష్ట్రాలనుంచి వచ్చిన అధికారులకు మూడు రోజుల శిక్షణ ఇస్తున్నా మన్నారు. ఉద్యాన శాఖ అమలు చేస్తున్న ఎంఐడీహెచ్ పథకంలో యాంత్రికీకరణలో భాగంగా రైతులకు పవర్ టిల్లర్లు, రొటోవేటర్లు, స్ప్రేయర్లు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేశామని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ముందు చూపుతో రైతుల ఉపయోగంకోసం కుప్పంలో 2019లో సీవోఈని ప్రారంభించారన్నారు. ఇక్కడ వివిధ రకాలైన కూరగాయల నారు, పూల మొక్కలు అత్యాధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని సీవోఈలలో కంటే కుప్పం సీవోఈలో కూరగాయల అంటుకట్టే విధానంపై ఇస్తున్న శిక్షణ నాణ్యమైనదని తెలియజేశారు. చిత్తూరు ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఏడీహెచ్‌సీవోఈ కోటేశ్వరరావు, కుప్పం, శాంతిపురం మండల ఉద్యాన అధికారులు డింపు ప్రియ, వింధ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు



కుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను కుప్పం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారినుంచి రూ.9లక్షలు విలువ చేసే 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కుప్పం రూరల్, అర్బన్ సీఐలు మల్లేశ్ యాదవ్, పి.శంకరయ్య, ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్ ఇచ్చి ఆదుకోండి

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు 226



బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి - కలెక్టరేట్‌కు వచ్చిన చిత్తూరు పాత బస్టాండు దుకాణదారులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరితోపాటు పలువురు అధికారులు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సమస్యలతో పాటు పింఛన్లకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చాయి. మొత్తం 226 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 171, పోలీసుశాఖకు 16, డీఆర్‌డీఏకు 18, మున్సిపాలిటీలకు 4, విద్యాశాఖకు 2, మిగిలినశాఖలకు 15 ఉన్నాయి.

ప్రధాన సమస్యలు ఇలా..

- ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో తన కుమారుడు నవీన్ రెండు కాళ్లను వైద్యులు తొలగించారని పెనుమూరు మండలం కేసీపల్లెకు చెందిన రోజా తెలిపారు. అతడికి పింఛను ఇచ్చి ఆదుకోవాలని కోరారు.
- పక్షవాతం కారణంగా కాళ్లు, చేతులు పనిచేయడం లేదని.. పింఛను ఇప్పించాలని గంగవరం మండలం పెద్దవొగిణి గ్రామానికి చెందిన అబ్దుల్ రహీమ్ కోరారు.
- తన భర్త చనిపోయాడని, కుటుంబ పోషణ కష్టంగా ఉంటోందని, వితంతు పింఛను మంజూరు చేయాలని చిత్తూరు తోటపాళ్యంకు చెందిన పళనియమ్మాల్ కోరారు. కొద్ది
- ఆన్‌లైన్‌లో జరిగిన తప్పుల కారణంగా తనకు పింఛన్ రావడం లేదని పరిశీలించి న్యాయం చేయాలని చిత్తూరు ఓబనపల్లెకు చెందిన వీరయ్య విన్నవించారు.
- దర్గాకు ప్రహరీ నిర్మిస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారని మండివీధి హజరత్ ఏక్తాదర్ ఆలీఖాన్ షాహిదిదర్గా కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.
- పాత బస్టాండ్‌ను యథాతథంగా కొనసాగించాలని పాత బస్టాండ్ షాప్‌కీపర్స్ అసోయేషన్ నేతలు కోరారు. ముందస్తు సమాచారం లేకుండా బస్టాండ్‌ను మూసేయడం వల్లే దుకాణదారుల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాలను కొనసాగించడంతో పాటు లోపలకు బస్సులను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..




బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీల్లో.. భూ తగాదాలపై 12, కుటుంబ తగాదాలపై 7, ఇంటితగాదాలపై 5, డబ్బుత గాదాలపై 5, దారితగాదాలపై 5, వేధింపులపై 3 చొప్పున ఉన్నాయి.

టిప్పర్‌ను ఢీకొన్న కంటైనర్

డ్రైవర్లకు గాయాలు



తీవ్రంగా గాయపడ్డ టిప్పర్ డ్రైవర్ శ్రీనివాసులు - కంటైనర్ డ్రైవర్ చిరంజీవి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై మొగిలి ఘాట్‌లోని దొరచెరువు పోలీసు ఔట్‌పోస్ట్ వద్ద సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి చిత్తూరువైపు వెళుతున్న కంటైనర్ ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఆ టిప్పర్ అదుపుతప్పి చిత్తూరు వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది. దాంతో కారు డివైడర్‌ను దాటి పలమనేరు రోడ్డుపై ఆగింది. ఆ సమయంలో ఏ వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారులో ఉన్న తిరుపతి ఆటోనగర్‌కు చెందిన ఆర్ముగం, లలిత సురక్షితంగా బయటపడ్డారు. గంగవరం మండలం మరిమాకులపల్లెకు చెందిన టిప్పర్ డ్రైవర్ శ్రీనివాసులు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో స్థానికులు, పోలీసులు బయటకు తీశారు. దిండిగల్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ చిరంజీవి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సంఘటనా స్థలంలో దెబ్బతిన్న వాహనాలు

వడ్డెర్లకు కులవృత్తి చేసుకునే అవకాశం కల్పించండి



కడా పీడీకి వినతిపత్రం ఇస్తున్న రాజ్‌కుమార్, వడ్డెర కులస్తులు

కుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మీపురంలో పెద్దసంఖ్యలో ఉన్న వడ్డెర కులస్తులకు కుల వృత్తి అయిన రాళ్లకొట్టే అవకాశం కల్పించాలని వడ్డెలర కులస్తులు కడా పీడీ వికాస్ మర్మత్‌కు విన్నవించారు. స్థానిక మండల సచివాలయంలో సోమవారం పీడీ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్తులు మాట్లాడుతూ తమకు రాళ్లకొట్టుకునేందుకు, ఫ్యాక్టరీలో రాళ్ల కటింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని పీడీని కోరారు. వడ్డెర కులస్తులకు మద్దతుగా టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ కూడా వారితో వచ్చి పీడీకి సమస్యలు విన్నవించారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి రూ.3కోట్లు మంజూరు

రామకుప్పం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3.49కోట్లు మంజూరు చేసిందని ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఈ నిధులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించి, ఇతర సౌకర్యాలతో కట్టడాలు నిర్మిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు, అందుకు సహకరించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ సీఎస్మునిరత్నంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలప్పల్లెలో వైద్యశిబిరం ఏర్పాటు



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలప్పల్లె గ్రామంలో సోమవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సాధారణవ్యాధులకు వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీచేశారు. పరిసరాల శుభ్రత, ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సునంద, ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఏఎన్ఎం యాస్మిన్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ముస్తాబైన కార్వేటికొండ



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసార్లపల్లె సమీపంలోవున్న కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో మంగళవారం జరిగే రథసప్తమి వేడుకలకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంవద్ద అన్నదానం చేయనున్నారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నతంబి భార్య నవనిత సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, యూనిట్ ఇన్‌చార్జీ రామ్మూర్తి, మాజీ సర్పంచు మహాదేవీజయశంకర్, నాయకులు ఎర్రప్ప, మునిరత్నం, శ్రీనివాసులు, చంద్ర తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



గంగవరం, ఫిబ్రవరి03,(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఏ (నోబుల్‌టీచర్స్ అసోసియేషన్) 2025 క్యాలెండర్‌ను సోమవారం గంగవరం ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులులు ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు చందనం రామయ్య, ఏఆర్ కుమార్, గణేష్, సూర్య ప్రకాష్, వెంకటముని, రెడ్డిశేఖర్, మనోహర్, వడయార్ పాల్గొన్నారు.

సాయిబాబా ఊరేగింపు



గంగవరం, ఫిబ్రవరి03(ఆంధ్రజ్యోతి): గంగవరం సాయినగర్‌లో వెలసిన సాయిబాబా స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారిని వివిధరకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ఆలయం వద్ద నుంచి మదనపల్లె రోడ్డు, బజారు వీధి, జవిళివీధి, పాతపేట మీదుగా ఊరేగింపు నిర్వహించారు.

భక్తురాలికి బ్రాస్‌లెట్ అప్పగింత



బ్రేస్‌లైట్ అప్పగిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద సోమవారం బెంగళూరు చెందిన ఎస్.సౌజన్య అనే భక్తురాలు బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకుంది. కొబ్బరికాయలు సమర్పించే ప్రాంతంలో 17 గ్రాముల బరువున్న బ్రాస్‌లెట్ పడిపోయింది. అక్కడినుంచి వెళ్లిపోయాక ఈ విషయాన్ని గమనించి ఆలయ ఈవో పెంచలకిషోర్‌కు తెలియజేశారు. ఆయన తన సిబ్బందితో అక్కడ వెతికించగా బ్రాస్‌లెట్ లభించింది. దాన్ని భక్తురాలికి అందించారు. ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలాలయస్వామి విశ్వరూప దర్శనం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో సోమవారం బాలాలయస్వామి విశ్వరూప దర్శనం, ఆరాధనను అర్చక, పండితులు నిర్వహించారు. వేకువ జామున ఆలయంలో హనుమత్ హవనం, పంచగవ్య హోమం, మహాపూర్ణాహుతి, బాలాలయ స్వామి శక్తి సంయోజన, మహాకుంభ ప్రోక్షణ, తదితరాలు నిర్వహించారు. వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి యూఎస్ఏకి చెందిన అనిల్ రూ.1.10 కోట్లను వెచ్చించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్,ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, గిరిధర్‌బాబు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కల్లూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలానికి మంజూరైన 50 కార్పొరేషన్ యూనిట్ల రుణాల కోసం అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజశేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి బీసీ-36 ఈబీసీ-2, కాపు-10, రెడ్డి-1, కమ్మ-1 యూనిట్ మంజూరయ్యాయని వివరించారు. బీసీ, ఈబీసీ, రెడ్డి, కమ్మ కులాలకు చెందిన అభ్యర్థులు 21 నుంచి 60 ఏళ్లలోపు, కాపు కులాలకు చెందిన అభ్యర్థులు 21 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఈనెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

క్షేత్రస్థాయి సందర్శనలతో సమస్యలు పరిష్కారం

సోమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి సందర్శనలతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీర్వోలతో సమీక్షించారు. మిట్టపల్లెలో జరుగుతున్న రీ సర్వే పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఇబ్రహీం, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

సోమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లెలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించ నున్నట్లు ఆలయ అర్చకులు గోపీస్వాములు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తామని తెలియజేశారు. అలాగే ఈక్రమంలోనే సోమల పరుష వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకపూజలు జరుపనున్నారు.

నాగబాబు ఆరోపణలు నిరూపించాలి

● మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై జనసేన నేత నాగబాబు చేసిన ఆరోపణలను నిరూపించాలని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప డిమాండు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలపై సోమల సభలో చెప్పినవన్నీ అసత్యాలన్నారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, వైసీపీ నాయకులు షరీఫ్, రమణ, విజయ్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గంగవరం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పట్టణ సమీపంలోని ఆంజనేయుని గుడి ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సోమ వారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీ సులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృత దేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలమనేరు సీఐ తెలిపారు.





అడుగంటిపోయిన బైరెడ్డిపల్లె చెరువు, కడపనత్తం చెరువు

అడుగంటుతున్న చెరువులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బైరెడ్డిపల్లె మండలంలో చెరువులు అడు గంటిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో వ్యవసాయ బోర్లలో సైతం నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో సాగునీటి సమస్య వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి సమీపిస్తుం డడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతుందేమోనని ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలో పెద్దచెరువులైన బైరెడ్డిపల్లె, కడపనత్తం చెరువులు పూర్తిగా అడుగంటి పోయే పరిస్థితి నెలకొంది. మిగతా చెరువులన్నీ ఇప్పటికే చుక్కనీరులేక ఎండి పోయాయి. పశుగ్రాసం కొరతతో పశుపోషణ భారమవుతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయబోర్లలో అడపాదడపా వస్తున్న అరాకొర నీటితో రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు.

అలైడ్ హెల్త్ సైన్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు

కుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధునాతన వైద్య రంగంలో అలైడ్ హెల్త్ సైన్సెస్‌కు రోజుకురోజుకూ ప్రాధాన్యం పెరగుతోందని పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాలలో సోమవారం అలైడ్ హెల్త్ సైన్సెస్‌తోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఫిజియో థెరపీ (బీపీటీ) తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య సేవలందించే విధానంలో బహుళ శాస్త్ర విధానానికి అవసరమైన అలైడ్ హెల్త్ నిపుణులు డయాగ్నొస్టిక్స్, థెరప్యూటిక్ కేర్, రిహాబిలిటేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పీఈఎస్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యశీలన్ మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టులు రోగుల సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిపాలనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు



ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన చౌడప్ప కుటుంబ సభ్యులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఆవును కొట్టాడని ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారూ గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. పుంగనూరులోని జోగిండ్లులో కాపురం ఉంటున్న చౌడప్ప ఇత్తడి పాత్రల వ్యాపారం చేస్తుంటాడు. వీరికి ఒక ఆవు ఉంది. ఆవును బయటకు వదలడంతో అదే ప్రాంతానికి చెందిన జయప్ప ఇంటి వద్దకు వెళ్లింది. దీనిపై ఇరువర్గాల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో జయప్ప కుటుంబసభ్యులు ధనంజయ్, అంజిలి, శ్రీనివాసులు చౌడప్ప కుటుంబ సభ్యులు సంతోష్, సురేశ్, రాణెమ్మ, భార్గవి ఒకరిపై ఒక్కరు కట్టెలు, రాళ్లు వేసుకుని ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారు గాయపడ్డారు. గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ సర్పంచి భర్తపై చర్యలు తీసుకోండి

కుప్పం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కారణం లేకుండా తమను దుర్భాషలాడిన కుప్పం మండలం గోనుగూరు సర్పంచి దీప్తి భర్త భాగ్యరాజ్ ప్రభంజన్, శ్రీకర్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ తెలుగు యువత అధ్యక్షుడు కార్తీక్, రమేష్ కుప్పం అర్బన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు.. సోమలలో జరిగిన జనసేన సభకు సంబంధించి గోను గూరులో వేసిన బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. భాగ్యరాజ్‌పై అను మానం కలిగింది. దీంతో జనసేన నాయకులు, కార్తీక్, రమేష్‌లు భాగ్యరాజ్‌కు ఫోన్ చేసి నిలదీశారు. దీంతో భాగ్యరాజ్, శ్రీకర్ వారిని దూషించారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోనుగూరులో బసవేశ్వర స్వామి ఆలయ నిర్మాణాన్ని ఓర్వలేకనే, అక్కడ పనులు చూస్తున్న తనను భాగ్యరాజ్, శ్రీకర్ దూషించారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా స్కంధ షష్టి పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం స్కంధషష్టి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి షష్టి గడియలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు షష్టి గడియలు ఉండటంతో ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



తాడిపత్రివాసిని పరామర్శిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం పరామర్శించారు. తాడిపత్రికి చెందిన సుబ్బరత్నమ్మ, నాగేంద్రలను, తిరుపతికి చెందిన క్షతగాత్రుడిని, శివగిరికి చెందిన దంపతులను ఉదయం 11.30 గంటలకు పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. డీఎస్పీ అజీజ్, సీఐ మహేశ్వర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, తెలుగు మహిళ అధికారప్రతినిధి మీరా, గుణశేఖర్, శ్రీధర్, సలీమ్, కన్నెప్ప, వైద్యాధికారులు కార్తీక్, మంజుల పాల్గొన్నారు.

భావనారాయణుడి సేవలో..

మాంగాడులో ఉన్న భద్రావతీ సమేత భావనారాయణస్వామి ఆలయంలో జరిగిన కల్యాణమహోత్సవంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

స్నేక్ క్యాచర్ మృతికి నివాళి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ తూర్పు విభాగంలో స్ట్రైక్ ఫోర్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్నేక్ క్యాచర్ ప్రేమ్‌కుమార్ మృతికి ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ నివాళి అర్పించారు. ఆదివారం దొడ్డిపల్లెలో పాము పట్టడానికి వెళ్లి తిరిగి వస్తూ.. కట్టమంచి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు.

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సభ్యురాలి రాక



డాక్టర్ పర్వీన్ సుల్తానాతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల తనిఖీ చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి డాక్టర్ పర్వీన్ సుల్తానా సోమవారం చిత్తూరుకు వచ్చారు. ముందుగా ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డును సందర్శించారు. రోగులతో మాట్లాడారు. అనంతరం టెలిఫోన్‌కాలనీలో యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు ప్రోగ్రామ్‌ల ఆఫీసర్లు హనుమంతరావు, జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో ఎర్రతివాచీ



రోజంతా మండిన సూర్యుడు సాయంత్రం కాస్త చల్లబడ్డాడు. సూర్యాస్తమయాన బైరెడ్డిపల్లె సమీపంలో కొండవాలులోకి జారుకుంటూ ఉండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. సూర్యుడి కిరణాలతో ఎర్రతివాచీ పరుచుకోవడంతో అప్పటివరకు ఉన్న నీలిమేఘాలు కాస్త ఎరు పెక్కాయి. ఆకాశం మొత్తం ఎరుపురంగు పులుముకుంది. ఈ సుందర దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. - బైరెడ్డిపల్లె

వసంత పంచమి వేడుకలు



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

రొంపిచెర్ల ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆకాశ్ పాఠశాలలో సోమవారం వసంతి పంచమి పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గణపతి పూజ, సరస్వతి పూజలు చేశారు. పిల్లలకు తల్లిదండ్రుల చేత అక్షరాలు రాయించారు. పురోహితుడు మునిరాజశర్మ పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ



సేంద్రియ విధానంలో సాగుచేసిన కూరగాయలు విక్రయిస్తున్న మహిళ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలకు సోమవారం రొంపిచెర్లలో జరిగిన వారపుసంతలో గిరాకీ పెరిగింది. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడకుండా సహజసిద్ధంగా పండించిన వివిధ రకాల కూరగాయలు మార్కెట్‌కు తీసుకువచ్చారు. ప్రజలు వీటిని ఎక్కువగా కొనుగోలు చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు

చౌడేపల్లె, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): చారాలలో వెలసిన అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం స్వామి వారికి ఆలయ నిర్వాహకులు పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రిస్వామి వారి ఉత్సవమూర్తులకు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కళ్యాణోత్సం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మంగళవారం ఉట్లోత్సవం ఘనంగా జరుగుతుంది.

శాస్త్రోక్తంగా గుంటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి దివ్వెలు చెల్లిస్తున్న భక్తులు

చౌడేపల్లె, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పరికిదొన గ్రామంలో నూతనంగా నిర్మించిన గుంటి గంగమ్మ ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా విగ్రహప్రతిష్ఠ చేశారు. ఉదయం గణపతి పూజ, కలశపూజ, శాంతి హోమాలు చేసి అమ్మవారిని ఊరేగించారు. అనంతరం అమ్మవారికి భక్తులు దివ్వెలు, చల్ల మొక్కులుగా చెల్లించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆంజప్ప, రమణ, సుబ్రహ్మణ్యం, తాతయ్య పాల్గొన్నారు.

సరస్వతీదేవి ఆలయంలో వసంతపంచమి వేడుకలు



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న సరస్వతీదేవి

కల్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో కొలువైన సరస్వతీదేవి ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం క్రోధి నామ సంవత్సరం మాఘ మాసం, శుద్ధపంచమి పర్వదినం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో అమ్మవారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఈ వేడుకలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకట శిద్దులు, రాజేంద్ర, ప్రకాష్, సుభాషిణి, పద్మవేణి, రేనుకాది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు భానుప్రకాష్ పరామర్శ


తాడిపత్రివాసిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం పరామర్శించారు. తాడిపత్రికి చెందిన సుబ్బరత్నమ్మ, నాగేంద్రలను, తిరుపతికి చెందిన క్షతగాత్రుడిని, శివగిరికి చెందిన దంపతులను ఉదయం 11.30 గంటలకు పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అజీజ్, సీఐ మహేశ్వర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, తెలుగు మహిళ అధికారప్రతినిధి మీరా, గుణశేఖర్, శ్రీధర్, సలీమ్, కన్నెప్ప, వైద్యాధికారులు కార్తీక్, మంజుల పాల్గొన్నారు.

భావనారాయణుడి సేవలో..: నగరి మండల పరిధిలోని మాంగాడులో ఉన్న భద్రావతీ సమేత భావనారాయణస్వామి ఆలయంలో జరిగిన కల్యాణమహోత్సవంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

రోడ్డు మరమ్మతులపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు





విజయపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒరూరు వద్ద తిరుత్తణి - నాగలాపురం రోడ్డు రెండేళ్లుగా గుంతలమయమైంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆంధ్రజ్యోతిలోనూ రెండు, కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ తీసుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సభ్యురాలి రాక


డాక్టర్ పర్వీన్ సుల్తానాతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల తనిఖీ చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి డాక్టర్ పర్వీన్ సుల్తానా సోమవారం చిత్తూరుకు వచ్చారు. ముందుగా ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డును సందర్శించారు. రోగులతో మాట్లాడారు. అనంతరం టెలిఫోన్‌కాలనీలో యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు ప్రోగ్రామ్‌ల ఆఫీసర్లు హనుమంతరావు, జానకీరావు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో జగన్మోహన్ పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో 11వ వార్డు చెరువు ముందర కాలనీలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పూజలు చేశారు. కాగా, పలమనేరు రోడ్డులోని హంగ్రీ బోర్డ్ రెస్టారెంట్, మురకంబట్టులోని డీవి మ్యాక్స్ థియేటర్‌ను మేయర్ అముదతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపాళ్యంవాసి వెంకటేష్ మృతి చెందడంపై ఎమ్మెల్యే థామస్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇదే ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సెల్‌ఫోన్లో ఆదేశించామని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని పేర్కొన్నారు. 108 అంబులెన్స్‌లు సకాలంలో రాకపోవడంపై స్పందిస్తూ ఇలానే కొనసాగితే సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి: వైసీపీ

తాపీ మేస్త్రీ వెంకటేష్, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఆమె వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు.


వెంకటేష్ బంధువులతో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

రామకృష్ణారెడ్డి కళా సేవ చిరస్మరణీయం


రామకృష్ణారెడ్డికి సన్మానం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పండరి భజన, చెక్కభజన, కోలాటం గురువు ఎన్.రామకృష్ణారెడ్డి కళా సేవ చిరస్మరణీయమని దూరదర్శన్ పూర్వకార్యనిర్వహణాధికారి డాక్టర్ ఓలేటి పార్వతీశం కొనియాడారు. వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లెకి చెందిన జానపద కళాకారుడు రామకృష్ణారెడ్డిని హైదరాబాదు రవీంద్ర భారతిలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, లలిత కళాభిరామ పించము, సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది.

ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ బాధ్యతల స్వీకారం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీఈడబ్ల్యూడీసీ నూతన ఈఈగా సోమవారం మురళీధర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న సుబ్బరాయలు నెల్లూరుకు బదిలీ అయ్యారు. మురళీధర్‌రెడ్డి కడప నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఓపెన్ డే కార్యక్రమం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కరపత్రాలతో విద్యార్థులు, అధ్యాపకులు

వరసిద్ధుడికి గ్రామోత్సవం



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం వరసిద్ధుడికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గణేష్‌గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

విషయం తెలుసుకుని మాట్లాడండి

వైసీపీ నాయకులపై టీడీపీ ఫైర్

గుడిపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు విషయం తెలుసుకుని మాట్లాడాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో సుమారు రూ.14 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, పానాటూరు రోడ్డులో నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అయినా కళ్లు మూసుకుని.. వైసీపీ నాయకులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడడం సబబు కాదన్నారు. చంద్రబాబును విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. నాయకులు గుర్రప్ప నాయుడు, హరిబాబు నాయుడు, అరుణ్, సుబ్రహ్మణ్యం, జయచంద్ర, రవి, జగదీశ్వర్ నాయుడు, నిత్యానందం యాదవ్, శివలింగారెడ్డి, గోపి, పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

మినీ గోకులాలపై అవగాహన

పెనుమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా రైతులకు మినీ గోకులాలు మంజూరైన విషయం తెలిసిందే. వీటిపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆరు పశువుల షెడ్లకు రూ.2.30 లక్షలు, నాలుగు పశువులున్న వారికి రూ.1.85 లక్షలు మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్ పాల్గొన్నారు.



రోడ్డా.. మురుగు కాల్వనా?

దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న భక్తులు

ఉత్తర బ్రాహ్మణపల్లెలో కాలువలు లేకపోవడంతో గ్రామస్తులు కొందరు మురుగును రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీనివల్ల రోడ్డుపై దుర్గంధం వెదజల్లుతోంది. కర్ణాటక, తమిళనాడు నుంచి కాలినడకన కాణిపాకం, తిరుమలకు వాహనాల్లోనూ.. కాలినడకన భక్తులు బ్రాహ్మణపల్లె మీదుగా వెళుతుంటారు. ఈ మురుగుతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- తవణంపల్లె, ఆంధ్రజ్యోతి

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక: డీఎస్పీ


సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ అజీజ్

నగరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. ట్రాఫిక్ మెరుగుపరచడంతోపాటు రోడ్డుప్రమాదాల నివారణపైనా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లను పెట్టుకోవాలన్నారు. బస్టాండు ప్రాంగణం, ఏకాంబరకుప్పం రైల్వేగేట్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

మాఘ మాస తొలి సోమవార పూజలు


గిరింపేట చిదంబరేశ్వర స్వామి ఆలయంలో..

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో మాఘ మాస తొలి సోమవార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు దీపారాధనలు చేశారు. అలాగే కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర, కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర స్వామి ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా సరస్వతీ పూజ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవళంపేటలోని సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో సోమవారం వసంత పంచమి వేడుకలు జరిగాయి. సరస్వతీ పూజ, చిన్నారులకు అక్షరాభ్యాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోక్రటీస్ స్కూల్ వైస్ చైర్మన్ హరీష్, చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కరస్పాండెంట్ గుణశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మారేపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం సీడీపీవో పద్మసునంద, సూపర్‌వైజర్ భారతి సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు.

భక్తురాలికి బ్రాస్‌లెట్ అప్పగింత


సౌజన్యకు బ్రాస్‌లెట్‌ను అప్పగిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద సోమవారం బెంగుళూరు చెందిన ఎస్.సౌజన్య అనే భక్తురాలు బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకుంది. కొబ్బరి కాయలు సమర్పించే ప్రాంతంలో 17 గ్రాముల బరువున్న బ్రాస్‌లెట్ పడిపోయింది. అక్కడినుంచి వెళ్లిపోయాక ఈ విషయాన్ని గమనించి, ఆలయ ఈవో పెంచలకిషోర్‌కు తెలియజేశారు. ఆయన తన సిబ్బందితో అక్కడ వెతికించగా బ్రాస్‌లెట్ లభించింది. దాన్నిభక్తురాలికి అందించారు. ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేమ్ బోర్డు లేని బడి

ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం విజయమాంబాపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కొత్త భవనం కట్టారు. నూతన భవనంలో గత ఏడాది డిసెంబరు 3వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తున్నాయి. అయితే ఈ బడికి ఇంతవరకు నేమ్ బోర్డు ఏర్పాటు చేయలేదు. చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల విషపురుగుల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి: కమిషనర్


బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. నగరపాలక సంస్థ ఆవరణంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయని కమిషనర్ తెలిపారు. వచ్చిన అర్జీల్లో.. పింఛను 2, ఇంజనీరింగ్‌కు 1, టౌన్‌ప్లానింగ్‌కు 1, మెప్మాకు 1 చొప్పున ఉన్నాయని చెప్పారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలాలయస్వామి విశ్వరూప దర్శనం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో సోమవారం బాలాలయస్వామి విశ్వరూప దర్శనం, ఆరాధనను అర్చక, పండితులు నిర్వహించారు. వేకువజామున ఆలయంలో హనుమత్ హవనం, పంచగవ్య హోమం, మహాపూర్ణాహుతి, బాలాలయ స్వామి శక్తి సంయోజన, మహాకుంభ ప్రోక్షణ, తదితరాలు నిర్వహించారు. వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి యూఏస్ఏకి చెందిన అనిల్ రూ.1.10 కోట్లను వెచ్చించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, గిరిధర్‌బాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16 మందికి ఉద్యోగాలు



నగరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్‌సెంటర్ వారు నిర్వహించిన జాబ్‌మేళాలో 20 మందికి హాజరవగా 16మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి నియామక ఉత్తర్వులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అందజేశారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నగరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకవేడులో ఎమ్మార్పీఎస్ నేతలు మండల ఇన్‌చార్జి కార్తీక్‌మాదిగ ఆధ్వర్యంలో 'లక్షల డప్పులు.. వేల గొంతులు' వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శివయ్యమాదిగ, సీనియర్ నాయకులు కుమారస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ మృతికి నివాళి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ తూర్పు విభాగంలో స్ట్రైక్ ఫోర్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్నేక్ క్యాచర్ ప్రేమ్‌కుమార్ మృతికి ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ నివాళి అర్పించారు. ఆదివారం దొడ్డిపల్లెలో పాము పట్టడానికి వెళ్లి తిరిగి వస్తూ.. కట్టమంచి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక


వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ రవికుమార్

శ్రీరంగరాజుపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం ఎస్ఆర్‌పురంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ.11 కోట్ల 68 లక్షల 81వేలతో 146 పనులు చేయగా రికవరీకి రూ.28,368 ఆదేశించినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ సునీల్, ఎంపీడీవో మురళీమోహన్, ఏపీవో చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు రథసప్తమి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం రథసప్తమిని వేడుకగా నిర్వహించనున్నారు. కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేస్తామని ట్రస్ట్ నిర్వాహకుడు టి.వెంకటేషన్ తెలిపారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

తవణంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని ఎంపీడీవో రెడ్డిబాబు తెలిపారు. అర్హులైన వారు ఈనెల ఏడో తేదీలోపు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలనిసూచించారు. మండలానికి 80 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు.బీసీ-60, కాపు(బలిజ)-13, ఈబీసీ-3, కమ్మ-2, రెడ్డి-2 యూనిట్లు ఉన్నాయన్నారు.

గుడిపాల మండల మీట్ వాయిదా

గుడిపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల మీట్ కోరం లేకపోవడంతో మంగళవారానికి ఎంపీడీవో శివరాజ్ వాయిదా వేశారు. 12 మంది ఎంపీటీసీలకు ముగ్గురు మాత్రమే సంతకాలు చేయడంతో వాయిదా వేస్తున్నట్లు సభ్యులకు తెలిపారు. అయితే నేడు కూడా సమావేశం జరుగుతుందో లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్మశానానికి స్థలం కేటాయించండి

గుడిపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీ ముత్తుకూరుపల్లెలో శ్మశానానికి తగిన స్థలం కేటాయించాలని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, రామభద్రాపురం ఉపసర్పంచ్ యాదవ్, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రమిచ్చారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

తవణంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ప్రజాప్రతినిధులు సమక్షంలో సభ నిర్వహిస్తామన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

సీసీ కెమెరాల వితరణ



ఐరాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎం.పైపల్లె జడ్పీహైస్కూల్‌కు 1984-85 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు సోమవారం సీసీ కెమెరాలను వితరణ చేశారు. హెచ్ఎం అరుణ్‌కుమార్, పూర్వ విద్యార్థులు శేషాద్రి, జగదీష్, దిలీప్, బాబు, వేణు, బాల, రమేష్, శోభ తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించాలి

పెనుమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల్లో మురుగు నిల్వ లేకుండా పంచాయతీ కార్యదర్శులు తొలగించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలవగుంట పంచాయతీ రేణుకా నగర్‌లో గ్రామ మధ్యలో రోడ్డుకు ఆనుకుని మురుగు పారుతుందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో సెక్రటరీతో వెళ్లి పరిశీలించి, మురుగును తొలగించాలని చెప్పారు.

ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై మంత్రికి వినతి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించామని దేవళంపేట సోక్రటీస్ విద్యా సంస్థ అధినేత సాతాల గుణశేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం విజయవాడలో మంత్రిని కలసి సమస్యలు తెలియజేయగా.. పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారని పేర్కొన్నారు.